REGD NO. H 18

విడిప్రతి 0-25 పై.

19-4-68 శుక్రవారం

ఫోను: 335. స్థాపితం : 1958.
పొన్నమ్మన సుబ్రహ్మణ్యం
అండ్ సన్సు
సంతపేట నెల్లూరు.
మావద్ద అన్ని గవర్నమెంటు డిపార్టుమెంట్లకు కావలసిన బరజా, హార్డువేరు, రంగులు, పైపులు, శానిటరీవేరు, తూకములు, కొలతలు మరియు అన్ని రకములైన టూల్సు దొరకును.

# జమీన్ రైతు

స్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 40 ★ సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి ★ సంచిక 16

20-4-68 Saturday
LEELA MAHAL
NELLORE.
Dr. Gold Foot
&
The Bikini Machine
Cinemascope - Colour.



5 వ తేది భారత ఉపరాష్ట్రపతి శ్రీ వి. వి. గిరిగారిచే నెల్లూరులో ఆవిష్కరింపబడిన అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం



ఉపరాష్ట్రపతి శ్రీ వి. వి. గిరిగారికి నెల్లూరు మునిసిపల్ కౌన్సిల్ 5 తేది చేసిన పౌరసన్మానసభ చిత్రం. ఎడమనుండి కుడికి: గిరిగారి కుమారుడు శంకర్, గిరిగారి ధర్మపత్ని శ్రీమతి సరస్వతిబాయి, శ్రీ గిరి, చైర్మన్ శ్రీ ఆనం వెంకటరెడ్డి, కమిషనర్ శ్రీ ముర్తుజా.



# మైనారిటీవర్గాలసమాఖ్య రాజకీయ లాభాలకోసంకాదా?

## దీనితో సంజీవయ్యగారి సంబంధం రాజకీయవర్గాలకు ఆశ్చర్యంకలిగిస్తుంది!

(మా హైదరాబాదు విలేఖరి)

కొంతకాలంగా మైనారిటీ వర్గాలన్నిటినీ కూడగట్టి అఖిలభారత సమాఖ్య నొకదాన్ని ఏర్పాటుచేయాలని ఇక్కడ సన్నాహాలు జరుగుతున్నాయి. అనా ఎవరూ పట్టించుకో లేదు. కాని దామోదరం సంజీవయ్యగారు ఈ సమాఖ్య అధ్యక్షుడుగా ఎన్నికకావచ్చునని తెలియడంతో దానికి కొంత ప్రాముఖ్యత వచ్చింది.

ఈ వారం స్థానికంగా డాక్టర్ అంబేడ్కర్ జన్మదినోత్సవం సందర్భంలో ప్రసంగిస్తూ శ్రీ సంజీవయ్య ఈ సమాఖ్య ప్రతిపాదనను బహిరంగంగా సమర్థించారు కూడా.

ఈ ప్రతిపాదనకు మూలం మన రాష్ట్రంలో శ్రీ అక్బర్ హుసేన్. ఈయన క్రితం సార్వత్రిక ఎన్నికలకు ముందు, రాజకీయాల్లో దిగాలనే ఉద్దేశంతో రెవెన్యూ బోర్డు సభ్యత్వాన్ని వదిలిపెట్టారు. వీరికి ముఖ్యమంత్రి మద్దతుకూడా వుందనీ, శాసనసభకు గెలిచివుంటే, తప్పకుండా మంత్రి అయేవారనీ అనుకున్నారు. కాని ఉన్నవారినే మళ్ళీ కాంగ్రెస్ అభ్యర్థులుగా ఎంపిక చేయాలనే నిర్ణయం జరగడంవల్ల బ్రహ్మానందరెడ్డిగారు అక్బర్ హుసేన్‌గారికి కాంగ్రెస్ టిక్కెట్టు ఇప్పించలేకపోయారు. వచ్చే శాసనమండలి ఎన్నికల్లో ఈయనకు స్థానం లభించవచ్చునని భావించబడుతున్నది.

బహుశంగా ఆస్తిపరులై సాంఘిక ప్రతిపత్తి బాగా కల అక్బర్ హుసేన్ గారు ప్రభుత్వోద్యోగం విరమించిన నాటినుంచి చాలా కార్యశీలురై తంటాలుపడుతున్నారు. ఆయనొకవిధంగా అల్పసంఖ్యాక వర్గం వారందరినీ ఏకంచేయాలని సంకల్పించుకొని కృషిచేస్తున్నారు. కాంగ్రెస్‌వారు, కాంగ్రెసేతరులు, ముస్లిం మతోన్మాదానికి మూలకందమైన మజ్లిస్ నాయకులుకూడా, ఎందుచేతనో ఈయన అండన చేరారు.

అల్పసంఖ్యాక వర్గాల సమాఖ్య నొకదాన్ని ఏర్పాటుచేయాలని ఈయన ప్రారంభించిన ప్రయత్నాన్ని, పైన పేర్కొన్నట్టు ఆదిలో ఎవరూ పట్టించుకొనలేదు కాని సంజీవయ్యగారు దీని నాయకత్వం వహించబోతున్నారంటే– సంజీవయ్యగారు మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి, మన రాష్ట్ర ప్రజల్లో రాజకీయ వర్గాల్లో కొంత పలుకుబడి, ప్రతిష్ఠకలవ్యక్తి కావడం వలన–దీనికి కొంత ప్రాముఖ్యతకలిగింది.

అల్పసంఖ్యాకవర్గమన్నది, మనదేశ చరిత్రలో ఒకప్రత్యేకమైన భావాన్ని–ప్రమాదకరమైనదాన్ని–ద్యోతకంచేస్తుంది. ముస్లిం అల్పసంఖ్యాకవర్గానికి రాజకీయ పరిగణనిచ్చి, ప్రత్యేక ప్రాతినిధ్యం ఇవ్వడం మూలాన్నే, దేశవిభజనకు మార్గమేర్పడిందని ఆధునాతన భారతదేశచరిత్ర అధ్యయనంచేసిన వారందరికీ తెలిసినదే. మరి మతసంబంధమైన అల్పసంఖ్యాకులను కూడగట్టడంలో ఈ సమాఖ్య ఉద్దేశమేమిటోబోధపడడంలేదు. మతసంబంధమైన అల్పసంఖ్యాకులకు ప్రత్యేకంగా రాజకీయ ప్రాముఖ్యత, భారతదేశం స్వతంత్రమైన తరువాతను, మతప్రమేయంలేని రాజ్యాంగ మమలైన తరువాతను అంతరించింది. లేకపోతే ప్రజాస్వామ్యానికర్థమేవుండదు.

హైదరాబాదులో ముస్లిం మతోన్మాద శక్తులు నానా బీభత్సంచేశాయి. దారుణమైన ఈ చారిత్రకఘట్టంలో ప్రముఖ పాత్రవహించిన ఇత్తెహాదుల్ ముస్లిమీన్ నాయకులుకూడాకల ''సమాఖ్య''తో సంజీవయ్యలాంటి జాతీయవాద నాయకులకు ప్రమేయముండడం ఆశ్చర్యకరంగా తోస్తున్నదిక్కడి రాజకీయవర్గాలకు.

—కొరవ 7 వ పేజీలో

## సామరస్య ఎన్నిక

ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికలు ఆశ్చర్యాలు, అసంతృప్తులు ఏమీ లేకుండా సామరస్యంగా జరిగిపోయాయి. శ్రీ కాకాని వెంకటరత్నంగారే అధ్యక్షులుగా నిష్పోటీగా ఎన్నుకోబడినారు. రిటర్నింగ్ ఆఫీసరుగా శ్రీ కొండా నారపరెడ్డిగారు ఎన్నికైనారు. అంటే సందా నారాయణప్పగారి 'సీటు'ను బ్రహ్మానందరెడ్డిగారు మంచిగా వదిలించుకున్నారన్నమాట! కార్యవర్గము, ఇతర కమిటీల ఎన్నికకు ముఖ్యమంత్రికి పట్టాభిషేకం చేయబడింది!

డాక్టరు బెజవాడ గోపాలరెడ్డిగారి రూపపటాన్ని ఉపరాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి 5 తేది శ్రీ కస్తూరిదేవి విద్యాలయంలో ఆవిష్కరించారు. ఆ సందర్భంలో పాఠశాల పాలకవర్గం పక్షంగా స్వాగతం పలుకుతున్న పార్లమెంటు సభ్యులు శ్రీ రేబాల దశరథరామరెడ్డిగారిని; ఆశీనులై వున్న కేంద్రమంత్రి శ్రీ కె. వి. రఘునాథరెడ్డి, పాలకవర్గ అధ్యక్షులు శ్రీ తిక్కవరపు రామరెడ్డి, శ్రీ గిరిగారలను ప్రక్క చిత్రంలో చూడవచ్చు.

మీ రైసుమిల్లులకు కావలసిన అన్ని రకములైన రైసుమిల్లు సామానులు - బెల్టులు - బాల్ బేరింగులు - ఇనుము మరియు హార్డువేరు సరసమైన ధరలకు విక్రయించబడును.

సాధు నారాయణరావు & కంపెనీ

సంతపేట—నెల్లూరు.

— ఫోను : 417 —

*

ప్రారంభం : 22-4-68 సోమవారం

# ఐ. ఆర్. 8 సేద్యం

## వ్యవసాయశాఖవారి సాగు సరణి— వై. బి. రెడ్డిగారి అనుభవైక వివరణ

ఐ. ఆర్. 8 సాగుకు సంబంధించి వ్యవసాయశాఖవారి సూచనలివి—

1. నారుమడి విస్తీర్ణము: 7 సెంట్లు. 1 సెంటునకు 3 పౌనుల విత్తనములు చల్లవలెను.

2. నారువయసు: 21 రోజులనుండి 25 రోజులు. నారుమొక్కకు 4-5 ఆకులు వచ్చినప్పుడు వేయవలెను.

3. నాటుట: 4''×4'' లేక 5''×5'' ఖాళీలలో నాటవలెను.

4. నాటుటకుముందు: అమ్మోనియం ఫాస్ఫేటు 50 కిలోలు; లేక డి- అమ్మోనియంఫాస్ఫేటు 50 కిలోలు; లేక 100 కిలోల సూపరుఫాస్ఫేటు, 50 కిలోల అమ్మోనియం సల్ఫేటు.

5. నాటిన 15-25 రోజులలో; 50 కిలోల యూరియా లేక 100 కిలోల అమ్మోనియా వేయవలెను.

క్యూమాన్ (cuman) 250 గ్రాములు + డెమోక్రాన్ (Democran) 100 మిల్లిగ్రాములు స్ప్రేయింగు చేయవలెను.

6. నాటిన 35—45 రోజులలో 40 కిలోల యూరియా, 75 కిలోల అమ్మోనియా వేయవలెను.

క్యూమాన్ (cuman) 500 గ్రాములు + డెమోక్రాన్ (Democran) 100 మిల్లిగ్రాములు స్ప్రేయింగు చేయవలెను.

7. నాటిన 60—65 రోజులలో, క్యూమాన్ (cuman) 500 గ్రాములు;





డెమోక్రాన్ (Drmocran) 500 మిల్లి గ్రాములు స్ప్రేయింగు చేయవలెను.

### వై. బి. రెడ్డిగారి వివరణ

కృషి పండితుడు శ్రీ వై. బి. రెడ్డి (కొత్తూరు-నెల్లూరుతాలూకా) ఐ. ఆర్. 8 సాగుకు సంబంధించి అనుభవ పూర్వకమైన వివరణలిచ్చారు. వై. బి. రెడ్డిగారు ప్రయోగంచేయని కొత్తరకం వరిపైరు లేదంటే అతిశయోక్తి కాదు. అన్నిటికంటే ఐ. ఆర్. 8 ఉత్తమోత్తమమైనదని వారంటారు. అది 4½ మాసాల పంట. మద్రాసు రాష్ట్రంలో పాపులర్‌గావున్న ఎ. డి. టి. 27 కూడా మంచి వరిరకమని; 105 రోజులలో పండడము, మన కేసర్లకంటే ఎక్కువపండడము అందులో విశేషమని వారి అభిప్రాయం. అయితే దాని సాగు కొంతకష్టం. ఎప్పుడూ నీరుండాలి; ఎక్కువవుండకూడదు, తక్కువవుండకూడదు. ఈ వసతులువుండి, శ్రద్ధగా చేయగలిగితే, ఎ. డి. టి. 27 కూడా ప్రయత్నించతగినదేనని వై. బి. రెడ్డిగారి అభిప్రాయం. దీనిని శ్రీ గునుపాటి రామచంద్రారెడ్డి బోటివారు కొందరు సాగుచేశారు. కాని అంత ప్రోత్సాహకరమైన ఫలితాలు వచ్చినట్లులేదు. అందువల్ల అది పాపులర్ కాలేదు.

ఐ. ఆర్. 8 అన్నిఅదనులలో ప్రయోగం చేయబడింది. వై. బి. రెడ్డిగారే ప్రయత్నించారు. అన్నిసీజన్లలో తక్కిన అన్ని పైర్లకంటే ఎక్కువపండింది. పి సీజన్లో కూడా ఎకరాకు రెండువుట్లకు తగ్గలేదనేది

—కొరవ 10 వ పేజీలో



మీ ఉత్తరాలు
త్వరగా పోస్టు చేయండి

తపాలా కార్యాలయాలలో పని ముగిసే సమయానికి ఎక్కువ ఉత్తరాలు పోస్టు చేయబడుతాయి. ఒక్కసారిగా వొత్తిడి రావటంతో జరిగే పని ఆలస్యమవుతుంది.

త్వరగా పోస్టు చేశారంటే ఆనాటి టపాలోనే మీ ఉత్తరం రవాణా చేయబడుతుంది. దాని గమ్యం సకాలానికి చేరుతుంది. ఏ మాత్రం ఆలస్యం వుండదు.

*ఇప్పుడే పోస్టు చెయ్యండి. సాయంత్రంవరకు వేచి వుండట మెందుకు?*



భారత తంతి తపాలా శాఖ

davp 67/537



మత్స్యపరిశ్రమాభివృద్ధికి ఎంతోఅనువైన ప్రదేశం పులికాట్‌సరస్సు. ఈపులికాట్ సరస్సులో చేపలు పట్టడమే వైద్యశ్యం—ఆ చేపలుపట్టేవాడి పంటపండింది.

—'హిందూ' సౌజన్యంతో.

# పులికాట్ సరస్సు—

## ఆంధ్రప్రభుత్వం నిద్రపోతున్నదనడానికి ఒక చిన్న తార్కాణం: అటవీశాఖ — జనసంబంధశాఖలమధ్య నలిగిపోతున్న ఒక ఫైలు గాథ

ఏమిటి బంగోరె పిచ్చిగాని ఒక్క పులికాట్‌సరస్సునుగూర్చి ఇన్నిసార్లు వ్రాయాల్నా? వ్రాసిందే వ్రాయాల్నా? వ్రాసిందాన్నే అటుత్రిప్పి ఇటుత్రిప్పి మార్చిమార్చి మళ్ళీమళ్ళీ వ్రాయాల్నా?— అనవద్దు. దాదాపు రెండుసంవత్సరాలివతల మూడునాలుగు దఫాలుగా యీ పులికాట్ సరస్సునుగూర్చి బంగోరె మొత్తుకుంటూ వ్రాయడం జరిగింది; రెండు మూడు ఫోటోలనుకూడా ప్రచురించడం జరిగింది.

మన ఆంధ్రదేశపు బడాబడా పత్రికలు వ్రాయకపోయినా ఇలస్ట్రేటెడ్‌వీక్లీ, టైమ్స్ ఆఫ్ ఇండియా, డెకెండ్ ఫీచర్సు హిందూ వంటిపత్రికల్లో ఈ ప్రదేశాన్ని గూర్చిన వార్తాలేఖలు ఎన్నెన్నో వచ్చాయి, సచిత్రకంగాకూడా. అవి వచ్చినప్పుడల్లా వాటికి ప్రతిధ్వనులుగా బంగోరె తన తరాటా సాగిస్తూవచ్చాడు. మొన్నిమధ్య కొలరిద్దరు మిత్రులు ప్రస్తావించారు— ఏమయ్యా బంగోరె, నీ పులికాట్ సరస్సునుగూర్చి 'హిందూ'లో మళ్లీ కొలా యన తగులుకొన్నాడే, చూశావా—అని. దానికి ప్రతిధ్వనిగానే బంగోరె మళ్లీ తయారుచేసిన వ్యాసానిక యిది.

ఈ ప్రస్తావన కొచ్చేదానికి ముందుగా కొంతరెండు విషయాలు చెప్పవల్సినవి, చర్చించుకోదగినవి వున్నాయి. బంగోరె వ్రాతల తడాఖావల్లగాకపోయినా, ఆ పెద్ద పత్రికల వ్రాతలవల్లనైనా కేంద్రప్రభుత్వం కళ్ళుతెరవక తప్పలేదు; ఈ పులికాట్ సరస్సు ప్రాధాన్యతను గుర్తించక తప్పలేదు.

6-7-1967 నాడు కేంద్ర ప్రభుత్వ డైరెక్టర్ జనరల్ ఆఫ్ టూరిజం గారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్సు గారికి వొక ప్రతిపాదన పంపారు. (ఆ టాబు నెంబరుకూడా యిస్తున్నాము— నెం. 9 టి. పి. ఎల్ II 12/67) ఏమని ప్రతిపాదన పంపారు? పులికాట్ సరస్సులో వొక బర్డ్సు శాంక్చువరీని (నీటిపక్షుల కొరకు స్థావరాన్ని) ఆ. ప్ర. ప్రభుత్వం ఏర్పర్చేపక్షంలో అందుకయ్యే ప్రారంభఖర్చులో సగభాగందాకా కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందనికూడా ఆ ప్రతిపాదనలో తెలిపారు.

బం. గో. రె.

ఆ. ప్ర. ప్రభుత్వోద్యోగి కాబట్టి చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్సుగారు నెలరోజులు నిద్రపోయి, నెల్లూరు సౌత్ ఫారెస్టాఫీసరు గారికి లాంఛనప్రాయంగా ఆ కాగితాల్ని ఫర్వార్డ్ చేశారు. సౌత్ ఫారెస్టాఫీసరుకూడా నిద్రపోయినట్లున్నది. దానికి సంబంధించిన కాగితాలు వారికి అంతు దొరికినట్లే లేదు. బంగోరె ఆమధ్య అదేపనిగా సౌత్ ఫారెస్టాఫీసుకెళ్ళి విచారిస్తే ఆ ఫైలు పోయిందన్నారు పదరు ఆఫీసు సూపరింటెండెంట్ గారు.

ఆ తర్వాత, కేంద్ర టూరిజంశాఖ డైరెక్టరునుంచి వచ్చిన ప్రతిపాదన కాబట్టి, అది మన డిపార్టుమెంటుకు సంబంధించింది కాదని తెల్సుకుని, ఆ సదరు రాష్ట్ర చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్సుగారు రాష్ట్ర టూరిజం డైరెక్టరుకు ఆ ప్రతిపాదన కాగితాలను బదలీచేశారు (ఆ ఫైలునెంబరు కూడా యిస్తున్నాము—నెం.18707/66-F2 తేది 7-8-1967 ప్రకారం ఆ. ప్ర. చీఫ్

—కొరవ 10 వ పేజీలో

